RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు యూనివర్సల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



పెద్దపల్లి: అక్టోబర్, 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )
త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి త్రోబాల్ సెలక్షన్ ట్రయల్స్‌లో యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు.సబ్‌జూనియర్ విభాగంలో టీ. మహీదర్, సాయి చరిత్, సూరజ్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అక్టోబర్ 4న హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో ఉన్న అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు.విద్యార్థులు క్రీడల్లో రాణించడం పట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కల్వల సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అంతర్గాం ఎస్‌హెచ్‌ఓగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్

## ప్రజల భద్రతే తొలి ప్రాధాన్యత.. నేరాల నియంత్రణే లక్ష్యం

పెద్దపల్లి , అక్టోబర్ 3 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)




అంతర్గాం పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, పోలీస్‌--ప్రజల సమన్వయంతో నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

# అర్హులైన ప్రతి వికలాంగుడికి అందేలా కృషి

## శ్రీరంగాపూర్ మండల మహిళ ఎన్పిఅర్డి ఇండియా నూతన కమిటీ ఎన్నిక



వనపర్తి : అక్టోబర్ 3, (తెలంగాణ వాణి ప్రతినిధి)
వికలాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న ఎన్పిఅర్డి ఇండియా శ్రీరంగాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన మండల మహిళా విభాగం మరియు మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సందర్భంగా మండల మహిళా అధ్యక్షురాలిగా అనంతపురం స్వప్న, మహిళా సహాయ కార్యదర్శిగా ఈరపాగ చిట్టమ్మ, మండల ఉపాధ్యక్షుడిగా తోట రామకృష్ణలను నూతనంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాముడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కేశపాగ రవికుమార్, మండల కార్యదర్శి తోక రవికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆది జనార్దన్, జిల్లా కార్యదర్శి సుశీల, జిల్లా నాయకురాలు గోవిందమ్మతో పాటు వివిధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు వికలాంగుల హక్కుల సాధన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వికలాంగుడికి అందేలా కృషి చేయడం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.వికలాంగుల హక్కుల సాధన కోసం ఎన్పిఅర్డి ఇండియా ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

# వికలాంగుల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిష్కరించాలి

## - డాక్టర్. ఈదునూరి . వెంకటేశ్వర్లు

నర్సంపేట:అక్టోబర్ 3(తెలంగాణ వాణి ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం అనేక వసతులను కల్పిస్తుంది. వారి ఉద్యోగ డిమాండ్లను ఆర్థిక సమస్యలను పరిష్కరించడం చాలా సంతోషకరం. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అటెండర్ నుండి ఐఏఎస్ స్థాయి వరకు వికలాంగుల ఉద్యోగ సమస్యలను కూడా పరిష్కరించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంత్రిత్వ శాఖ. ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో విద్య వైద్యం అన్ని రకాల ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి. అందుకోసం మండల స్థాయిలో. డివిజన్ స్థాయిలో. జిల్లా స్థాయిలో. రాష్ట్రస్థాయిలో వికలాంగుల ఉద్యోగుల యొక్క సమస్యల సాధన కోసం ప్రత్యేకమైన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి. ప్రతి ఉద్యోగ వికలాంగుల యొక్క దరఖాస్తులకు తప్పనిసరిగా నమోదు చేయాలి. ఉద్యోగ వికలాంగుల సంఘాలను కూడా తప్పకుండా ప్రతి సమావేశానికి ఆహ్వానం పలుకాలి. వీరికి ప్రయాణ రాయితీలు కల్పించాలి. స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. మామూలు ఉద్యోగుల కంటే 10 అదనపు సెలవులను మంజూరు చేయాలి. ఎఫ్ ఆర్ ఎస్ హాజరు నుండి వికలాంగులను మినహాయించాలి. డిపార్ట్మెంట్ టెస్ట్‌ల నుండి వీరిని మినహాయించాలి.
ఉన్నత విద్యలను. శాఖాపరమైన పరిశోధనల కోసం వికలాంగులకు వేతనాలతో కూడిన సెలవులను మంజూరు చేయాలి. గురుకులాలలో పనిచేస్తున్న వికలాంగులైన లెక్చరర్స్ మరియు టీచర్స్ కు నైట్ స్టడీ డ్యూటీల నుండి మినహాయించాలి. రీడర్ అలవెన్స్ పెంచాలి. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల యొక్క సమస్యల సాధన కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం ప్రత్యేకంగా మానవతా దృక్పథంతో వికలాంగుల ఉద్యోగుల యొక్క సమస్యలను కూడా పరిష్కారంచేయవలసిందిగా ప్రభుత్వానికి మనవి.

# గిరిజన ప్రాంత ప్రజలకు క్యాన్సర్ ఆసుపత్రి భరోసా



## - నారాయణపురంలో రూ.200 కోట్లకు పైగా అంచనా వ్యయంతో ఆసుపత్రి



సత్తుపల్లి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):
సత్తుపల్లి మండలం నారాయణపురంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.200 కోట్లకు పైగా అంచనా వ్యయంతో నిర్మించనున్న క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నారాయణపురంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు, హెచ్‌పీవీ టీకా కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించడం ఎంతో అవసరమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు, క్యాన్సర్ నివారణ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆసుపత్రికి అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ముందస్తు స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణపై ట్రస్ట్ దృష్టి సారించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి సత్తుపల్లి, అశ్వారావుపేట, ములకలపల్లి ప్రాంతాలతో పాటు ఏపీ సరిహద్దు ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీ సునీల్ దత్, ఐటీడీఏ పీవో బి. రాహుల్, కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్ యాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సిరిపురం మేజర్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేయాలి



## - రైతుల ధర్నాకు బీజేపీ కిసాన్ మోర్చా సంఘీభావం



తల్లాడ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):
సిరిపురం మేజర్ కింద సాగు చేస్తున్న రైతులకు తక్షణమే గోదావరి జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు తల్లాడ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆపతి వెంకట రామారావు సంఘీభావం తెలిపారు. సిరిపురం మేజర్ అభివృద్ధి పనుల పేరుతో రెండు నెలలుగా సాగునీటి విడుదల నిలిచిపోవడంతో సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంకట రామారావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ప్రస్తుతం నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రభుత్వం స్పందించి సిరిపురం మేజర్ పనులను తాత్కాలికంగా నిలిపి, సీతారామ ప్రాజెక్టు ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు చేరుకున్న తల్లాడ ఎస్ఐ రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతుల సమస్య పరిష్కారమయ్యే వరకు బీజేపీ కిసాన్ మోర్చా అండగా ఉంటుందని వెంకట రామారావు తెలిపారు. కార్యక్రమంలో బిల్లుపాడు గ్రామ రైతులు మేడం మోహన్‌రావు, ఏగుపాటి హనుమంతరావు, మేడ నరసింహారావు, రాయల రమేష్, గొర్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టుకున్న పోలీసు సిబ్బందికి నగదు రివార్డులు

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





ఆదిలాబాద్, అక్టోబర్ 03 ( తెలంగాణ వాణి ప్రతినిధి )
గంజాయి అక్రమ సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా పోలీసులు, గంజాయిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో గంజాయిపై సమర్థవంతంగా పనిచేసిన గాదిగూడ ఎస్సై రమ్య, కానిస్టేబుల్ రాథోడ్ భరత్‌లను జిల్లా ఎస్పీ ఆహ్వానించి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డులను అందజేశారు. గంజాయి అక్రమ సాగుపై సమాచారం సేకరించి చర్యలు తీసుకోవడంలో సిబ్బంది చూపిన చొరవను ఎస్పీ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, గంజాయి అక్రమ సాగు, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గంజాయిపై పోరాటంలో యువతతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, గంజాయి నిర్మూలనలో యువత ముందుండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు.

# హరిణి మృతికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

## - ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

## - హరిణి కుటుంబాన్ని పరామర్శించిన ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆదిల్




జూలూరుపాడు, అక్టోబర్ 3, ప్రతినిధి:
హరిణి మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యుడిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఎండి ఆదిల్ డిమాండ్ చేశారు. హరిణి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిల్ మాట్లాడుతూ.. హరిణి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ వంతు అండగా ఉంటామని తెలిపారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై పటిష్టమైన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేయాలని కోరారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నిందితుడికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అవసర మైన సహాయ సహకారాలు అందించేందుకు ఏఎండీఆర్ ఫౌండేషన్ ముందుంటుందని ఆదిల్ స్పష్టం చేశారు. ఘట నపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యల ద్వారా భరోసా కల్పించాలని కోరారు. హరిణి సోదరి ఉన్నత చదువులకు తమ ఫౌండేషన్ అండగ ఉంటుందని, భవిష్యత్ లో వాళ్ళ కుటుంబానికి ఎటువంటి ఆర్థిక భరోసా కావాలన్న తాము అండగ ఉంటామన్న ఆయన హరిణి ఘటనలో ఎటువంటి న్యాయ పరమైన సహకారం చేసేందుకు తమ బృందం సిద్ధంగా ఉందన్నారు.

# గర్భిణీలకు ఘనంగా శ్రీమంతాల వేడుకలు

## 9వ పోషణ మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



జూలూరుపాడు, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి):
9వ పోషణ మాసం సందర్భంగా కాకర్ల గ్రామంలోని ఫ్రీ ప్రైమరీ స్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలను పూలు, పసుపు, కుంకుమతో అలంకరించి, పండ్లు, పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్ దీపా, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు పాల్గొన్నారు.

# తెలుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం





దేవరకొండ, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):
పోషణ మాసం సందర్భంగా దేవరకొండ మండలం తెలుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే ఆకు కూరలు, కూరగాయలు, కరివేపాకు, మునగాకు వంటి పోషకాహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు.
అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి శిశు పోషణ, తల్లిపాల ప్రాముఖ్యత, ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు గృహ సందర్శనలు నిర్వహిస్తూ తల్లులకు పోషణ, ఆరోగ్యంపై అవసరమైన సూచనలు అందిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి అంగన్వాడి టీచర్ సునీత ఆయమ్మ యాదమ్మ, ఏఎన్‌ఎం శోభారాణి, వాణి ,ఆశా జ్యోతి సర్పంచ్ గ్రామ పెద్దలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆది జాంబవంతుని శోభాయాత్రకు భారీగా తరలిరావాలి



డిండి, అక్టోబర్ 3 (తెలంగాణ వాణి ప్రతినిధి):
నల్గొండలో ఈ నెల 11న సాయంత్రం 4 గంటలకు బస్టాండ్ నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించనున్న ఆది జాంబవంతుని మహా శోభాయాత్రకు మాదిగ సోదర, సోదరీమణులు భారీగా తరలిరావాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకులు నగేష్ మహారాజ్ పిలుపునిచ్చారు. ఆది జాంబవంతుని చరిత్ర, సామాజిక సేవ, వారసత్వాన్ని భావితరాలకు చాటేలా శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ, నల్గొండ, నకిరేకల్, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, మునుగోడు నియోజకవర్గాల నుంచి యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శోభాయాత్రను ప్రశాంతంగా, క్రమశిక్షణతో విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.